
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024



మాలల సింహగర్జనను విజయవంతం చేయండి

యాచారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సికింద్రాబాద్‌లో ఆదివారం జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు మండల నాయకులు కృష్ణమూర్తి, నర్సింహ్మారావు, జైభీం ఎడ్యుకేటెడ్ యూత్ జిల్లా నాయకులు మరాటివివేక్ కోరారు. శనివారం గునగల్, మాల్ తదితర గ్రామాలలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమాలలో నాయకులు బుగ్గరాములు, టి.నరేందర్, యాదయ్య, రమేష్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నేదునూరులో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కందుకూరు / మహేశ్వరం నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కందుకూరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న వృత్తి విద్యనైపుణ్య విశ్వవిద్యాలయం, స్కిల్ యూనివర్సిటీతో అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం కందుకూరు, మహేశ్వరం, బడంగ్‌పేటలో రూ.69 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పి.సబితారెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కందుకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో రోడ్ల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనకు పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

మున్సిపాలిటీల ఏర్పాటును విరమించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు, మహేశ్వరం మండల కేంద్రాలను మున్సిపాలిటీలుగా చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే సబితారెడ్డి వినతి పత్రం ఇచ్చారు. మున్సిపాలిటీలుగా ఏర్పడితే ఉపాధిహామీ పనులు నిలిచిపోతాయని, నల్లా, ఇంటి పన్నుల భారం ప్రజలపై పడుతుందని ఆమె తెలిపారు. మంత్రి స్పందించి.. ఇప్పటి వరకు అలాంటి ప్రతిపాదనలు తన వద్దకు రాలేదని, ప్రజల స్థితిగతుల ఆధారంగానే నిర్ణయం ఉంటుందని చెప్పారు.

భూ సమస్యను పరిష్కరించాలి

గతంలో నేదునూరు, అక్బర్జా రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను దళితులకు ఇచ్చారని, ధరణి పోర్టల్‌లో వారి పేర్లను చేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ అనీల్ కుమార్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, డి.చంద్రశేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆమె జీవితమంతా డోలు, తాళాల చప్పుళ్లే. డిల్లెం బల్లెం పాటలు లేకుండా ఆమె రోజు ప్రారంభమయ్యేది కాదు. పుట్టిన నాటి నుంచే ఒగ్గు కథలు వింటూ పెరిగింది. తన తండ్రి పేరొందిన కళాకారుడు కావడంతో ఆయనతో పాటు కథలు చెప్పేందుకు వెళ్లేది. చిన్న వయసులోనే శ్రీశైలం మల్లన్నను పెళ్లి చేసుకొని జీవితాన్ని ఆ దేవుడికే అంకితం చేసింది. మగవారిలా దుస్తులు ధరించి కథ చెప్పడం ప్రారంభిస్తే జనం తండోపతండాలుగా రావాల్సిందే. ఇంటిముందే తన తండ్రి సమాధిని నిర్మించుకున్న మేడిపల్లికి చెందిన ప్రముఖ కళాకారిణి జమ్మ మల్లారి ఒగ్గుకథా జీవితంపై ప్రత్యేక కథనం. ఆమె మాటల్లోనే..



సూర్యుడికి బతలకడవ తీయిస్తున్న మల్లారి(ఫైల్)

Sunday Special

మజారే మల్లారి

ఒగ్గు కళాకారిణిగా ప్రసిద్ధి

- పదిహేనేళ్లకే దేవదేవుడితో వివాహం
- జీవితమంతా డిల్లెంబల్లెం పాటలే
- ఇంటి ముందే తండ్రి సమాధి నిర్మాణం
- బీరప్ప, మల్లన్న కథ చెప్పాలంటే ఆమె ఉండాల్సిందే
- వేషం కట్టిందంటే కథ రక్తి కట్టాల్సిందే
- ఒగ్గుకళాకారిణి జీవితంపై ప్రత్యేక కథనం



డోలు వాయిస్తూ ఒగ్గుకథ చెబుతున్న మల్లారి

యాచారం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మా ఊరు యాచారం మండలం మేడిపల్లి గ్రామం. నా తండ్రి జమ్మ గుండాలు, తల్లి చెన్నమ్మ. నాకు ఒక అక్క, అన్నతో పాటు ఐదు మంది చెల్లెళ్లు ఉన్నారు. నేను నా తల్లిదండ్రులకు మూడో సంతానం. నేను చంటిపాపగా ఉన్నప్పుడు మూడు రోజుల పాటు నా తల్లి వద్ద పాలు తాగలేదని, ఆ సమయంలో నేను ఆరోగ్యంగా ఉంటే ఆ దేవుడికే ఇచ్చి పెళ్లి చేస్తానని నా తండ్రి శ్రీశైలం మల్లికార్జునస్వామి వారికి మొక్కాడు. దాంతో నా ఆరోగ్యం కుదుటపడి కొన్ని గంటల వ్యవధిలో నా తల్లి వద్ద పాలు తాగానని నా తండ్రి చెప్పారు. నాకు పదిహేనేళ్ల వయసు ఉన్నపుడు మా అన్న. బీరయ్య వివాహం జరిగింది. ఆ సమయంలో

మిగతా 7వ పేజీలో...

మా నాన్న మాతోనే ఉండేలా..

నా తండ్రి బతికి ఉన్నప్పటి నుంచి ఈ ఇల్లు పెంకుటిల్లుగా ఉండేది. ఆనాడే ఈ ఇంటిని దేవుడి గుడిగా పిలిచేవారం. నా తండ్రి మృతి చెందిన సమయంలో అంత్యక్రియలు శ్మశానవాటికలో వద్దని ఇంటి ఎదుటే సమాధి నిర్మించాలని ఆనాడు గ్రామపెద్దలు చెప్పారు. దాంతో పాటు మాకు కూడా మా తండ్రి మా వెంటే ఉండాలని భావించి ఇక్కడే బొందపెట్టి సమాధి నిర్మించుకున్నాం. అనంతరం నా అన్న కొడుకును నా తండ్రి పేరైన జమ్మ గుండాలుగా పిలుచుకున్నాం.



ఇంటి ఎదుట మల్లారి తండ్రి సమాధి

మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వద్దు

రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి



కొత్తూరు కస్తూర్బా పాఠశాలలో సాంబారును పరిశీలిస్తున్న జ్యోత్స్నారెడ్డి

మొయినాబాద్ రూరల్/ షాద్‌నగర్ / కొత్తూరు, , నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నాశివారెడ్డి హెచ్చరించారు. శనివారం ఆమె మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల, చిలుకూరు సాంఘిక సంక్షేమ పాఠశాల, ఫరూఖ్‌నగర్ జెడ్పీ, కొత్తూరు కస్తూర్బా పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఫుడ్ క్వాలిటీ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్ షెడ్లు, స్టోర్‌రూమ్‌లు, బియ్యం, వంట సామగ్రిని పరిశీలించారు. భోజనానికి ఉపయోగించే కూరగాయలను, ఇతర వస్తువులను చూసి ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనంలో పోషక పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట జిల్లా విద్యాధికారి సుశీందర్, మండల విద్యాధికారి వెంకటయ్య, వెంకయ్య తదితరులు ఉన్నారు.

ప్రయోగాలతో ప్రతిభ వెలుగులోకి

- జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు
- ముగిసిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- మొదటి బహుమతి సాధించిన కాకతీయ హైస్కూల్ స్టూడెంట్స్



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న డీఈవో సుశీందర్‌రావు

శంషాబాద్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న పరిశోధన, పరిశీలన, ప్రయోగాత్మక, సామర్థ్యం వెలికితీయడమే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని డీఈవో సుశీందర్‌రావు అన్నారు. శంషాబాద్ ఒయాసిస్ పాఠశాలలో నిర్వహించిన 52వ జిల్లా స్థాయి పాఠశాల వైజ్ఞానిక, 12వ ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి 431 ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ఈ ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. భవిష్యత్ నిర్మాణంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. రెండు రోజుల్లో 52 పాఠశాలలకు చెందిన 11వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. 8 ఇన్‌స్పైర్ ఉత్తమ ప్రదర్శనలు, మొదటి స్థానంలో నిలిచిన ప్రాజెక్టులు డిసెంబర్‌లో జరిగే గణితం, వైజ్ఞానిక, పర్యావరణ రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొంటాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో అత్తాపూర్ కాకతీయ హైస్కూల్‌కు ప్రథమ, శంషాబాద్ ప్రభుత్వ పాఠశాలకు ద్వితీయ, హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు తృతీయ బహుమతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత రఘునందన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా..

జిల్లాలో విస్తరిస్తున్న హెచ్‌ఐవీ

నేడు ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినం

- అవగాహన కల్పించడంలో అలసత్వం
- మహమ్మారి బారిన పడి మృత్యువాత
- అప్రమత్తతే ఆయుధమంటున్న వైద్యులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ ఈ పదం వింటేనే ఒకప్పుడు జనం హడలెత్తిపోయేవారు. దీనిపై అప్పట్లో విస్తృతంగా జరిగిన ప్రచారం ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కలిగించింది. ముఖ్యంగా "పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా?" అని ప్రభుత్వం నిర్వహించిన ప్రచారం ఒకప్పుడు ఊరూవాడా హోరెత్తించింది. ఆ వ్యాధి అంటేనే జనం భయంతో వణికి పోయేవారు. 'పులిరాజా' ప్రచారం ద్వారా అప్పట్లో హెచ్‌ఐవీ కేసుల సంఖ్య కొంత తగ్గుముఖం పట్టింది. అయితే ప్రస్తుతం ప్రచారం కొరవడటంతో హెచ్‌ఐవీ మళ్లీ చాపకింద

మిగతా 8వ పేజీలో...



ఏడు నెలల్లో నమోదైన హెచ్‌ఐవీ కేసులు

	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు	మొత్తం
పాజిటివ్	39	38	35	51	29	32	50	274

నాలుగేళ్లుగా నమోదైన హెచ్‌ఐవీ కేసులు

	2020-21	2021-22	2022-23	2023-24	2024 (ఇప్పటి వరకు)	మొత్తం
పాజిటివ్	220	278	302	391	274	1,465

కంపు కంపు 8

- డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- నిధులు మంజూరైనా సాగని పనులు
- 'పట్నం' మున్సిపాలిటీ ప్రజల ఇక్కట్లు
- పట్టని అధికారులు, పాలకులు



శుభకార్యాలే టార్గెట్ 7

- దొంగల ముఠాలోని ఇద్దరు అరెస్టు
- ముప్పై ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం
- మరో ఇద్దరు నిందితుల పరార్



రైలు దిగిన రెండు నిమిషాలకే...
మృత్యు ఒడిలోకి

పత్తి కూలీలను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా

- మహిళా కూలీతో పాటు బాలిక మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- మృతులు కర్నూల్ జిల్లా వాసులు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూర్, నవంబర్ 30:(ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చిన కూలీలను తరలిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కూలీలు రైలు దిగిన రెండు నిమిషాలకే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ హృదయ విదారక సంఘటన కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ సమీపంలో చేగూర్ రహదారిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... కర్నూల్ జిల్లాకు చెందిన పలువురు పత్తి తీసే కూలీలు మండల పరిధిలోని రెడ్డిపాలెంలో ఉంటూ పనిచేస్తున్నారు. కొందరు కూలీలు తమ పింఛన్లు తెచ్చుకోడానికి ఇటీవల కర్నూల్ జిల్లాలోని తమ గ్రామాలకు వెళ్లారు. తిరిగి రైలులో ప్రయాణించి తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌లో దిగారు. ఆరుగురు కూలీలతో పాటు, ఇద్దరు పిల్లలను ట్రాక్టర్‌లో ఎక్కించుకుని డ్రైవర్ రెడ్డిపాలెంకు బయలుదేరాడు. ఈ క్రమంలో బయలుదేరిన రెండు నిమిషాలకే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సోమమ్మ(48), మమత(5) అక్కడికక్కడే మృతిచెందారు. బాలిక తల్లి సుజాత, వెంకటేశ్వరమ్మ, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలు సోమమ్మ భర్తతో పాటు, కుమారుడికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్ఐలు జి.శ్రీనివాస్, మురళీగౌడ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కొత్తూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, స్థానికుల సహాయంతో గాయపడినవారిని 108లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలను శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి



మాట్లాడుతున్న శంకర్ శ్రీదేవి

ఇబ్రహీంపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించేవారు కూడా శిక్షార్హులని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని ఎస్సీ బాలుర గురుకుల కళాశాలలో ప్రధానమంత్రి బాల్య వివాహ్ ముక్తి భారత్ పిలుపు మేరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. 18ఏళ్ల బాలికలు, 21 ఏళ్ల వయసు నిండిన బాలురు మాత్రమే వివాహానికి అర్హులన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ల వాడకం తగ్గించి, చదువులపై దృష్టి సారించాలన్నారు. అలాగే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరెడ్ల అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు శనివారం నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, యాదాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో చలి కాస్త తగ్గింది. గత వారం రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరుగుతుండగా శుక్రవారం రాత్రి మాత్రం ఏకంగా ఐదారు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి.

క్షిపణుల తయారీలో భారత్ నంబర్ వన్

సాంకేతిక ప్రగతి, డీఆర్డీవోకు సహకారంలో నిట్ పాత్ర కీలకం

వరంగల్ నిట్ స్నాతకోత్సవంలో డీఆర్డీవో చైర్మన్ కామత్

హనుమకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): క్షిపణుల తయారీ రంగంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, సరికొత్త ఆవిష్కరణలతో మన రక్షణ విభాగం అత్యంత శక్తిమంతంగా మారిందని డీఆర్డీవో చైర్మన్ సమీర్ వీ కామత్ అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో 22వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో మొట్టమొదటి ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీ స్థాయి నుంచి జాతీయ సాంకేతిక కళాశాలగా ఎదిగిన వరంగల్ నిట్ ప్రస్థానం అద్వితీయమని కొనియాడారు. అత్యున్నత విద్యా ప్రమాణాలను అందించడం, ఆవిష్కరణలకు జీవం పోయడం, నూతన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం ద్వారా నిట్ తన ప్రస్థానాన్ని విప్లవాత్మకంగా సాగిస్తోందన్నారు. దేశాభివృద్ధిలో, సాంకేతిక ప్రగతిలో, డీఆర్‌డీవోకు సహకారం అందించడంలో నిట్ క్రియాశీల భూమిక పోషించిందన్నారు. అగ్ని, పృథ్వీ, ఆకాశ్ వంటి క్షిపణులు, తేలికపాటి యుద్ధవిమానాలు, యుద్ధట్యాంక్ అర్జున్, రాకెట్ లాంచర్ పినాకలాంటి సాయుధ సంపత్తిని డీఆర్‌డీవోనే తయారు చేసిందన్నారు. వీటన్నింటి వల్లనే దేశ రక్షణ రంగం అత్యంత శక్తివంతమైందిగా నిలిచిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త అంశాలను నేర్చుకుంటూ ఉండాలని చెప్పారు. అంతకు ముందు కామత్ నిట్‌లో ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ స్నాతకోత్సవానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ అధ్యక్షత వహించారు. నిట్ సాధించిన ప్రగతిని వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 1,875 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో 10మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సారి నిట్ గోల్డ్ మెడల్ విజేతగా మంజిమా కర్మాకర్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) నిలిచారు.

సరూర్‌నగర్ స్టేడియంలో 6న బీజేపీ భారీ సభ

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక?

బీఆర్ఎస్ నోటిఫికేషన్లకు కాంగ్రెస్ కొలువులు

ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు

బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ పాలన: కిషన్‌రెడ్డి

సర్కారు వైఫల్యాలపై నేటి నుంచి నిరసనలు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 6న సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై ఆదివారం నుంచి బీజేపీ నిరసన కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుపై ఆదివారం చార్జ్‌షీట్ విడుదల చేయనుంది. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుంది. 2, 3, 4 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహించనున్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చింది తప్ప.. ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పంచాయతీలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కారులు ఒక్క పైసా ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ కూడా అరకొరగా చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోని అహంకారం, నియంతృత్వం, అవినీతి, వైఫల్యాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఏ వర్గమూ సంతోషంగా లేదని.. రాష్ట్ర ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమబాట పట్టాలని పార్టీ నాయకులకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలనస్ఫూర్తిగా తీసుకుని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని, కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగట్టాలని ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు.



హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ నమూనా

రూ.26 కోట్లతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రైల్వేస్టేషన్ ప్రతిపాదిత డిజైన్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కల్పన వల్ల రైల్వే స్టేషన్ అత్యాధునిక రవాణా కేంద్రంగా మారుతుందని తెలిపారు.

సభ్యత్వ నమోదుపై బన్సల్ క్లాస్..

బీజేపీ క్రియాశీల సభ్యత్వంపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 20వేల క్రియాశీల సభ్యత్వాలు అయ్యాయని.. ఇంకా 30 వేలు చేయించాల్సిందేనని స్పష్టం చేశారు. సభ్యత్వాలు చేయించని వారికి పార్టీ పదవులు ఎందుకని ప్రశ్నించారు. "సభ్యత్వ నమోదు మొదలు ప్రతీ పార్టీ కార్యక్రమాలకు తెలంగాణ నేతలు సడలింపులు కోరతారు. యూపీ కంటే ఇక్కడ కులపిచ్చి ఎక్కువ. అధికారంలోకి రావాలంటే సంస్థాగత బలోపేతం అత్యంత కీలకం. హరియాణా, మహారాష్ట్ర రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం" అని స్పష్టం చేశారు.


వైసీపీ నేతల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లు

పులివెందుల వైసీపీ నేతల చెరవీడిన తెలంగాణ కార్లు

- ఏపీ మంత్రి లోకేష్ చొరవ.. సంగారెడ్డి వాసి సతీష్‌కు ఊరట
- ఇతడి సంస్థ నుంచి లీజుకు తీసుకున్న వికారాబాద్ వాసి
- అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులకు బాడుగకు
- సతీష్‌కు అద్దె చెల్లించని వికారాబాద్ యువకుడు మణిరాజ్
- అడిగినందుకు చంపేస్తామని బెదిరింపులు.. చిత్రహింసలు
- ఏపీ ఆదేశాలతో స్వాధీనం చేసుకున్న తెలంగాణ పోలీసులు


బాధితుడు సతీష్‌కుమార్

సంగారెడ్డి క్రైం, నవంబరు 30: గత మూడేళ్లుగా పులివెందుల వైసీపీ నాయకుల చెరలో ఉన్న తెలంగాణ వ్యక్తికి చెందిన ఆరు కార్లకు ఏపీ మంత్రి నారా లోకేష్ చొరవతో మోక్షం లభించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సతీష్‌కుమార్ హరిహర కార్ రెంటల్ పేరిట సంస్థను నడుపుతున్నాడు. వికారాబాద్ వాసి మణిరాజ్ 2021 ఏప్రిల్‌లో ఆరు కార్లను అద్దెకు తీసుకున్నాడు. 4 నెలల పాటు డబ్బు చెల్లించలేదు. ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో 2023 జనవరిలో సతీష్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మణిరాజ్‌ను ఓ మోసం కేసులో సైబరాబాద్ పరిధి జీడిమెట్ల పోలీసులు నిరుడు జూలై 5న అరెస్ట్ చేశారు. సతీష్ ఫిర్యాదుతో పీటీ వారెంట్‌పై సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను తీసుకున్న కార్లలో కొన్ని పులివెందుల వైద్య కళాశాలలో లీజుకు నడుస్తున్నాయని, మరికొన్ని వైసీపీ నేతల వద్ద ఉన్నాయని మణిరాజ్ తెలిపాడు. దీంతో సతీష్ వాహనాల గురించి వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వైసీపీ నేతలతో మాట్లాడుదామని వేంపల్లె పోలీసులు తీసుకెళ్లగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులు వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, వైసీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిలు సతీష్‌ను తీవ్రంగా కొట్టారు. కార్లు అడిగితే చంపుతామని బెదిరించారు. ఇడుపులపాయలోని గదిలో ఐదు రోజులు బంధించి చిత్రహింసలు పెట్టారు. చంపేందుకు కుట్ర పన్నారు. ఏపీలో ప్రభుత్వం మారడంతో ఇటీవల సతీష్ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రులు, నేతలను కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. సోషల్ మీడియాలో ఏపీ మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లాడు. జనసేన నేతలకు కూడా తెలిపాడు. ఆయన ఆదేశాలతో ఏపీ పోలీసులు.. ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరుల వద్ద ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సంగారెడ్డి పట్టణ పోలీసులు వాటిని తీసుకువచ్చారు. కార్లను కోర్టులో ప్రవేశపెడతామని సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ శనివారం తెలిపారు. 2021 నుంచి ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు తన కార్లను దౌర్జన్యంగా వాడుకున్నారని సతీష్ చెప్పాడు. వేంపల్లె పోలీసులు గతంలో వైసీపీ నేతలకే మద్దతు పలికినట్టు ఆరోపించాడు. కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి వైసీపీ నేతల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, తన ప్రాణానికి ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. తనను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

2 నుంచి సాయంకాలం బీటెక్ తరగతులు ప్రారంభం

- జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయంకాలం బీటెక్‌లో ప్రవేశాలు పొందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు డిసెంబరు 2 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు సమాచారమిచ్చినట్టు చెప్పారు. ఈవెనింగ్ బీటెక్ అకడమిక్ క్యాలెండర్‌ను ఆయన శనివారం విడుదల చేశారు. వర్సిటీలోని మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ఈ ఏడాది నుంచి కొత్తగా ఈవెనింగ్ బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 4వరకు మొదటి సెమిస్టర్ కొనసాగుతుందని, సెకండ్ సెమిస్టర్ జూన్ 2న ప్రారంభమై అక్టోబరు 18తో ముగుస్తుందన్నారు. సాయంకాలం బీటెక్ రెండో సంవత్సరం తరగతులను 2025 నవంబరు 3 నుంచి ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

అప్పులు తీర్చలేక పత్తి రైతు ఆత్మహత్య

- సిరిసిల్ల జిల్లా జవారిపేటలో ఘటన

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు అధికమవడం, అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించక పత్తిరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేటకు చెందిన రైతు కోమటి నాగరాజు (49) తనకున్న 4 ఎకరాలతోపాటు మరో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ప్రతీ ఏటా నష్టం రావడానికి తోడు కుమార్తె వివాహం చేయడంతో దాదాపు రూ.15 లక్షల అప్పులయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మనోవేదనతో శనివారం పొలంలో పురుగు మందు తాగాడు. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.

పాఠశాలల బంద్ విజయవంతం



చేవెళ్లలో బడి నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

చేవెళ్ల/కందుకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల డివిజన్‌లో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైందని డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్, శ్రీనివాస్ తెలిపారు. చేవెళ్లలోని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులను బయటకు పంపి బంద్ చేయించాయి. వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మిడ్ డే మీల్స్ చార్జీలు పెంచాలన్నారు. నాణ్యత లేని మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారని, దీంతో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చరణ్‌గౌడ్, తేజ, చందు, సాయిగౌడ్, బన్నీ, అనిల్‌కుమార్, విష్ణు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. కందుకూరు మండలంలో విద్యాసంస్థలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బంద్ చేయించారు. ఫెడరేషన్ మండల నాయకులు వినోద్, సిద్ధులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, చరణ్, ఆకాష్, వేణు, సందీప్ పాల్గొన్నారు.

మామిడి పూత దశలో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి


సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి సురేష్

కందుకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మామిడి తోటలు పూత దశకొచ్చే సమయంలో రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడి పొందాలని జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ తెలిపారు. శనివారం కందుకూరు రైతు వేదికలో మండల ఉద్యాన అధికారి సౌమ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. సూచనలు ఇచ్చారు. మామిడి పూత సమయంలో వాతావరణం మేఘావృతమై, ఎండ తగలకు పూత ఎక్కువగా రాలుతుందని, పూత రాలకుండా ఉండాలంటే థైమితోక్షం మూడు గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా మ్యాక్స్ మందునైనా స్ప్రే చేయాలన్నారు. అలాగే కూరగాయ పంటల్లో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ రసాయనిక ఎరువులను తగ్గిస్తూ, ఆర్గానిక్(సహజ) ఎరువులను వేయాలన్నారు. రైతులు ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని, ఈ తోటల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఐడీఏ శాస్త్రవేత్త శ్రీకృష్ణ, ఏవో కృష్ణమోహన్, ఏఈవోలు రాజు, మల్లేష్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

బుగ్గజాతరలో కామారెడ్డి ఎమ్మెల్యే పూజలు


బుగ్గరామంగేశ్వరుడికి పూజలు చేస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు

మంచాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా భాసిల్లుతున్న బుగ్గ క్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు చివరి దశకు చేరాయి. శనివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాట్పల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి బుగ్గజాతరలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవదేవుడిని వేడుకున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి, బి.ప్రతాప్, వి.వెంకట్‌రెడ్డి, బాషయ్య, పి.జంగయ్య, జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీశైలం, ఎం.వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, రమేష్, బిక్షపతి, డి.రమేష్, యాదగిరిరెడ్డి, చంద్రమౌళి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేత దండెం రాంరెడ్డి బుగ్గరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయనతో నాయకులు కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హాథీరాం, రాహుల్, అక్షయ్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చక్రపాణి, శేఖర్‌చారి, సాయి, పవన్‌గౌడ్, అఖిల్, రాంబుబు, మధు, సత్యనారాయణ, సందీప్ ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌కొచ్చే వారికి గౌరవమివ్వాలి

వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి


రిటైరవుతున్న ఎస్సై జయశంకర్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

వికారాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరికి సమాన గౌరవం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల పాసింగ్ ఔట్ పూర్తిచేసుకుని రిపోర్ట్ చేసిన కానిస్టేబుళ్లతో శనివారం సమావేశం నిర్వహించారు. వారితో ఎస్పీ మాట్లాడుతూ.. ట్రైనింగ్‌లో నేర్చుకున్న విధంగా విధులను అంకితభావం, క్రమశిక్షణతో నిర్వర్తించాలని సూచించారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, శారీరక ధృడత్వంపై నిత్యం దృష్టిపెట్టాలని, జిల్లాకు, రాష్ట్ర పోలీసు శాఖకు పేరు వచ్చేలా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో సివిల్ విభాగంలో 28 మంది, ఏఆర్ 66, కమ్యూనికేషన్ 3 మొత్తం 97మంది రిపోర్ట్ చేశారన్నారు. కార్యక్రమంలో ఏవో జ్యోతిర్మణి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు చిరకాలం గుర్తుంటాయి

ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఎస్‌ఐ జయశంకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని శాలువా, జ్ఞాపికలతో జయశంకర్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పోలీసు శాఖలో విధులు నిర్వహించి ప్రజలకు సేవచేయడం దేవుడిచ్చిన వరం అని, రిటైరైన అధికారులు వారి శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్ని ప్రయోజనాలను వెంటనే అందిస్తామని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఇద్దరు అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్, డీపీవో సిబ్బంది, రిటైరవుతున్న అధికారులు కుటుంబీకులు పాల్గొన్నారు.

మజారే మల్లారి

(5వ పేజీ తరువాయి...)

మా ఇంట్లో శ్రీశైలం మల్లికార్జున స్వామి కల్యాణం జరిపించాం. నాకు కూడా అదే సమయంలో ఆ దేవుడితో పెళ్లి చేశారు. అప్పటి నుంచి నా జీవితం ఆ దేవదేవుడికే అంకితం ఇచ్చాను.

మా అన్న పెళ్లిలోనే దేవుడితో..

నాకు దేవుడితో వివాహం జరిగిన తర్వాత నుంచి నేను మగవారిలా దుస్తులు ధరించడం అలవాటు చేసుకున్నాను. చొక్కా, దోవతి కట్టుకోవడం అలవర్చుకున్నాను. కేవలం ఒగ్గు కథలు చెప్పుతున్న సమయంలో స్త్రీ పాత్ర ఉంటే మాత్రమే మహిళా దుస్తులు ధరించాను. కథ చెప్పడం ముగియగానే దోవతికట్టి, చొక్కా తొడుక్కోవడం అలవాటైంది. ఓసారి నా తల్లిదండ్రులు పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ సమయంలో నాకు దేవుడితో పెళ్లి అయిపోయింది. ఆయనే దిక్కని పెళ్లి విషయం మరోసారి నావద్దకు తీసుకురావద్దని హెచ్చరించాను. దాంతో ఆనాటినుంచి పెళ్లి ప్రస్తావన తీసుకురాలేదు.

12 ఏళ్లు వచ్చే నాటికే..

చిన్ననాటి నుంచి నాతండ్రి వెంట గ్రామాలకు కథలు చెప్పేందుకెళ్లి డోలు వాయించడం, తాళాలు కొట్టడం నేర్చుకున్నాను. నాకు 12 ఏళ్లు వచ్చే సరికి బీరప్ప, మల్లన్న, మాందాత లాంటి దేవతల కథలు చెప్పడం అలవాటైంది. ఎక్కువగా మహంకాళీ, కామరాతి, సిరియాళ గౌరమ్మ వేశాలు వేశాను. ఒగ్గుకథలు చెబుతున్న సమయంలో స్త్రీ పాత్ర పోషించే సమయంలో స్త్రీలా చీరకట్టి, రవిక ధరించి ఒగ్గుకథలు చెప్పడంతో జనం ఎగబడి ఎంతో ఆసక్తితో వినేవారు. నేను కథ చెబుతున్నానని తెలిస్తే జనాలు తండోపతండాలుగా వచ్చేవారు. అలాగే నేను చాలా మందికి కథలు చెప్పడం నేర్పించాను. సుమారు నా వద్ద 15 మంది ఒగ్గుకథలు చెప్పడం నేర్చుకున్నారు. ఇందులోనూ చాలా మంది ఇప్పడికే చనిపోయారు. నా వద్ద కథలు నేర్చుకున్నవారు నేనంటే ఎంతో గౌరవిస్తారు.


35 ఏళ్లక్రితం బీరప్ప పండగ సమయంలో ఒగ్గుకథ చెబుతున్న జమ్మ మల్లారి (నీలిరంగు చీరలో..)

పేద కళాకారులను ఆదుకోవాలి

రాష్ట్రంలో ఒగ్గు కళాకారులకు మంచి ఆదరణ ఉంది. నా కథలను విన్న ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాకు రూ.లక్ష నగదు అందించారు. ఆ డబ్బుతో పాటు కొంత ధనం పోగు చేసి రెండు గదులు నిర్మించుకున్నాను. అందులో ఒకటి దేవుడికి కేటాయించాను. నా తండ్రి ఉన్నప్పటినుంచి శివసత్తిగా మారడం మానేశాను. నేను శివసత్తిలా మారిన సమయంలో నాతండ్రి వద్దని వారించడంతో విరమించుకున్నాను. ఒగ్గు కళాకారులకు సామాజిక పింఛన్లు అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. 60ఏళ్లు నిండిన ఒగ్గు కళాకారులకు విధిగా పింఛన్ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఒ గ్గు కథలు చెప్పించాలి. అప్పుడు ఒగ్గుకథలతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్తాయి. అలా ప్రభుత్వ పథకాల గురించి కథల రూపంలో చెబితే తగిన పారితోషికం ఇచ్చి ఆదుకోవాలి. ఇల్లు లేని పేద ఒగ్గు కళాకారులకు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

ఆపదొస్తే దేవుడే దిక్కు

నేను అనారోగ్యంతో బాధపడితే మా చెల్లెలు ఎల్లమ్మ నా వద్దే ఉండి నా బాగోగులు చూసుకుంటుంది. నా చెల్లెళ్లతో పాటు అన్నాదమ్ముల్లు, వారి కుమారులు కూడా నా బాగోగులు చూసుకుంటారు. నాకు ఏ ఆపద వచ్చినా ఆ దేవదేవుడికి పూజ చేస్తాను. వయోభారం చేత కొంత కాలంగా ఒగ్గుకథలు కేవలం కూర్చొని చెబుతున్నాను. ఇప్పటికైనా ఎవరైనా నా వద్దకు వచ్చి దేవుడి పెళ్లి చేయాలని కోరితే వెళ్లి నాతోటి కళాకారులతో కలిసివెళ్లి అంగరంగ వైభవంగా దేవుడి పెళ్లి చేయిస్తాను.


దేవుడికి పూజలు చేస్తున్న మల్లారి

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మంచాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యం చెందారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. సీపీఎం మంచాల మండల 9వ మహాసభలు శనివారం లోయపల్లిలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాన్‌వెస్లీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ఏడాది కావస్తున్నా చేసిందేమీ లేదన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. పోరాటాలతో సాధించుకున్న కార్మిక, రైతు చట్టాలను బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. వామపక్షాలన్నీ వర్గపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మహాసభల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.యాదయ్య, జగదీష్, భాస్కర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, జంగయ్య రాములు, పాపిరెడ్డి, స్వామి, రాజు, యూసుఫ్, జగన్, ఓ.భాస్కర్, ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

తాండూరు మీదుగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు



తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే అయ్యప్ప స్వాములకు శుభవార్త చెప్పింది. తాండూరు మీదుగా శబరిమలకు వెళ్లేందుకు ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. తాండూరు మీదుగా శబరిమలకు రెండురైళ్లను నడపనున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్ నుంచి కొట్టాయం(రైల్ నంబర్ 07135), కొట్టాయం నుంచి నాంపల్లికి(07136), అలాగే నగరంలోని మౌలాలి నుంచి కొల్లాంకు(07141), కొల్లాం నుంచి మౌలాలికి(07142) రైళ్లను నడుపుతారు.

హైదరాబాద్-కొట్టాయం-హైదరాబాద్ స్పెషల్ ట్రైన్

తాండూరు మీదుగా కొట్టాయానికి పది రైలు సర్వీసులను నడుపుతారు. 07135 నంబర్ రైలు బేగంపేట్, లింగంపల్లి, శంకర్‌పల్లి, వికారాబాద్ మీదుగా తాండూరుకు చేరుతుంది. ఈ రైలు కర్ణాటక, ఏపీలోని సేడం, యాద్గిర్, కృష్ణా, మంత్రాలయం, ఆదోని, గుంతకల్ తదితర స్టేషన్ల మీదుగా కొట్టాయం చేరుతుంది. తిరిగి కోట్టాయం(ట్రైన్ నం:07136)లో ప్రారంభమై ఇదే స్టేషన్ల మీదుగా హైదరాబాద్‌లోని నాంపల్లికి చేరుతుంది. ఈ రైలు హైదరాబాద్‌లో అర్ధరాత్రి 12గంటలకు ప్రారంభమై తాండూరుకు తెల్లవారు జామున 2:53గంటలకు చేరుకుని 2:55కు బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో కొట్టాయంలో సాయంత్రం 6:26గంటలకు ప్రారంభమై మరుసటి రోజు రాత్రి 11:23గంటలకు తాండూరు చేరుకుంటుంది. తాండూరు నుంచి ఈ రైలుకు స్లీపర్ కోచ్ టికెట్ ధర రూ.360గా నిర్ణయించారు. ఈ రైలు డిసెంబరు 3, 10, 17, 24, 31 తేదీల్లో నడుస్తుంది. ఇదే మార్గంలో మౌలాలీ-కొల్లాం-మౌలాలి సర్వీసు కూడా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలుకు అదనంగా చెంగనచేరి, తిరువల్ల, చెంగనూరు, కాయంకుళం స్టేషన్లలో హాల్టింగ్ ఉంది. 07141/07142 రెండు ప్రత్యేకరైళ్లు కూడా ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ భోగీలు ఉంటాయి.

భక్తులకు సమయం, డబ్బు ఆదా ..

తాండూరు నుంచి శబరిమలకు రైళ్లలో వెళ్లాలంటే గతంలో కర్ణాటకలోని వాడి, హైదరాబాద్‌లోని నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లకు వెళ్లేవారు. ప్రస్తుతం తాండూరు మీదుగా నూతనంగా రైలును ప్రవేశపెట్టడంతో అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమల వెళ్లేవారికి సమయం ఆదాతో పాటు టికెట్ ఖర్చులు కూడా తగ్గుతాయి. శబరిమలకు తాండూరు మీదుగా స్పెషల్ ట్రైన్లు వెళ్తుండడంతో అయ్యప్ప మాలధారులు, దర్శనానికి వెళ్లేవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



యాలాల ఎమ్మార్సీ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

యాలాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి వారిని క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం యాలాల విద్యావనరుల కేంద్రం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగులుగా 21సంవత్సరాలుగా పని చేస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్సీ, సీఆర్సీ, కేజీబీవీ, యూఆర్‌ఎస్, డీపీవో స్థాయిలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు వెంకటేశం, సీవో, సీఆర్పీలు శ్రీనివాస్, ఇస్మాయిల్, అమరేశ్వర్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని వ్యాపారులకు అమ్మేందుకే రైతుల ఆసక్తి

కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలతో ఇబ్బందులు


కులకచర్లలో వడ్లు అన్‌లోడింగ్ చేస్తున్న వ్యాపారి

పరిగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఏదోసాకు పెడుతుండటంతో చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకే ఆసక్తి చూపుతున్నారు. కులకచర్ల మండలంలో 9, చౌడాపూర్‌లో 7 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం సన్న వడ్లు ప్రతీ క్వింటాలుపై రూ.500 బోనస్ ఇస్తుండడంతో సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కాంటవేస్తున్నారు. ఇప్పటి వరకు తిరుమలాపూర్ కేంద్రానికి కేవలం ఒక్క లారీ సన్న వడ్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు తెలిపారు. తాలు, తేమ, మట్టి బెడ్డలు ఉన్నాయనే కారణాలు చూపుతూ కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కొనేందుకు కొర్రీలు పెడుతున్నాడు. తిరుమలాపూర్, ఇప్పాయిపల్లి, కుసుమ సముద్రం, పీరంపల్లి, కామునిపల్లి, ఘనపూర్ గ్రామాల రైతులు తమ వడ్లను కొనుగోలు కేంద్రాల్లో కాకుండా వ్యాపారులకు తక్కువ రేటుకు అమ్ముతున్నారు.

నిర్వాహకులకు తప్పని కష్టాలు

ఈ సారి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సైతం తిప్పలు తప్పడం లేదు. సన్నాలకు బోనస్ ఇస్తుండటంతో ప్రభుత్వం కొన్ని నిబంధనలను అమలుల్లోకి తెచ్చింది. సన్న రకం వడ్లు కొంటే ధాన్యం బ్యాగులపై రైతు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ రాయాల్సి ఉంటుంది. దీంతో ఎక్కడే పొరపాటు జరుగుతుందోనని ఒత్తిడికి గురవుతున్నారు. ఈ కారణంతో కేంద్రాల వద్ద కొనుగోళ్లు నెమ్మదిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

శుభకార్యాలే టార్గెట్‌గా చోరీలు

- ముఠాలోని ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఆదిభట్ల పోలీసులు
- 38 తులాల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం
- మరో ఇద్దరు నిందితుల పరార్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లు, శుభకార్యాలను ఎంచుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరిని శనివారం ఆదిభట్ల పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 38తులాల బంగారు ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు పరాయ్యారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వివరాలు వెల్లడించారు. నవంబరు 14న బ్రాహ్మణపల్లి ట్రాంకిల్ రిసార్ట్స్‌లో హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌కు చెందిన పారెపల్లి నర్సింహ, అనితల కూతురి వివాహమైంది. ఆ సమయంలో దొంగలు అనిత హ్యాండ్ బ్యాగ్‌ను దొంగిలించారు. అందులో 18తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు, ఓ సెల్‌ఫోన్ ఉన్నాయి. 15న నర్సింహ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు ఎస్.వెంకటేష్, కె.రాజు, నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుళ్లు ఉపేందర్‌రెడ్డి, సంతోష్, శివచంద్ర, కృష్ణ, రవీందర్, సందీప్‌లు మూడు టీంలుగా ఏర్పడి దొంగల కోసం గాలించారు. శనివారం హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవేపై బొంగులూరు ప్రమిద గార్డెన్ వద్ద నంబరు ప్లేట్‌లేని మారుతీ ఇగ్నిస్ కారును గుర్తించారు. పోలీసులను చూసి కారులో ఉన్న నలుగురిలో ఇద్దరు కారు దిగి పరారయ్యారు. అరుడ(38), మరో 12ఏళ్ల బాలుడు పట్టుబడ్డారు. కారులో 38తులాల బంగారు ఆభరణాలున్నాయి. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా నవంబరు 14న బ్రాహ్మణపల్లిలోని రిసార్టులో జరిగిన పెళ్లిలో 18 తులాల ఆభరణాలు, నగదు చోరీ చేశామని ఒప్పుకున్నారు. ఆ తర్వాత కర్ణాటకలోకి టిప్టూర్ పట్టణ పీఎస్ పరిధిలో మరో రెండు చోరీల్లో 20తులాల బంగారు ఆభరణాలు తస్కరించినట్టు తెలిపారు. నిందితులు మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘడ్ జిల్లా పిప్లరపొడ బొడా పోలీస్‌స్టేషన్ పరిధి గుల్ఖేడి, జల్‌ఖేడి గ్రామానికి చెందినవారుగా తేలింది. అరుడ, రిషి(19), అభిషేక్(25), 12ఏళ్ల బాలుడు ముఠాగా ఏర్పడి బంధువుల కారు కిరాయికి మాట్లాడుకున్నారు. ఈ నెల 10న వారి గ్రామం నుంచి బయల్దేరి 12న హైదరాబాద్ చేరుకున్నారు. నవంబరు 14న బ్రాహ్మణపల్లి ట్రాంకిల్ రిసార్ట్స్‌కు వచ్చారు. అభిషేక్ కారును బయట నిలిపి ఉండగా అరుడ, రిషి, 12ఏళ్ల బాలుడు రిసార్టు లోపలికెళ్లి బంధువుల వలె కూర్చున్నారు. బాలుడు పెళ్లి మండపం ముందు ఉన్న సోఫాలో కూర్చుని పెళ్లి కూతురు తల్లి అనిత బ్యాగ్‌ను కొట్టేశాడు. తిరిగి వీరంతా కారులో కర్ణటక వెళ్లి అక్కడా ఇదే రీతిలో రెండు ఫంక్షన్లలో బంగారు ఆభరణాలు చోరీ చేశామని ఒప్పుకున్నారు. ఇదిలా ఉంటే వీరిపై మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ ఏడు దొంగతనం కేసులు ఉన్నట్టు డీసీపీ తెలిపారు.

ఊరు ఊరంతా దొంగతనాలే వృత్తిగా..

ఎంపీలోని రాజ్‌గడ్ జిల్లా గుల్ఖేడి, జల్‌ఖేడి పక్కన ఉన్న మరో గ్రామంలోని అందరూ దొంగతనాలే వృత్తిగా ముఠాగా ఏర్పడి ఇతర రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. వీరి గ్రామంలోకి బయటవారు, పోలీసులుగానీ వస్తే దాడులకు కూడా తెగబడతారని చెప్పారు. అక్కడ విచారణకు వెళ్తే రాజ్‌గడ్ పోలీసులను తీసుకునే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ దొంగల ముఠాలో రిషి, అభిషేక్ అన్నదమ్ములని తెలిపారు. కాగా ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్సైలు, వారి టీం సభ్యులను డీసీపీ సునీతారెడ్డి అభినందించారు.

మెనూ ప్రకారం భోజనమందించాలి


పాఠశాలలో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

పెద్దేముల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మండలంలోని జనగాం ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. స్కూల్‌లో నిల్వ ఉన్న బియ్యం, వంట సామగ్రిని పరిశీలించారు. కిచన్ రూం శుభ్రంగా ఉందా.. లేదా? అని చూశారు. వంట వారు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. గిర్మాపూర్, జనగాం గ్రామాల్లో చేపట్టిన రోడ్డు పనులు నాణ్యతపై పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి సర్వే డాటా ఎంట్రీ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఎంట్రీలో తప్పులు లేకుండా కుటుంబ వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సుధీర్ సూచించారు.

సర్వే డాటా ఎంట్రీపై సీపీవో ఆరా


డాటా ఎంట్రీ వివరాలను తెలుసుకుంటున్న సౌమ్యామిశ్రా

ఆమనగల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీని వెంటనే పూర్తిచేయాలని జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్యామిశ్రా అధికారులను ఆదేశించారు. ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీని ఆమె పరిశీలించి ఎంట్రీలో ఏమైనా ఇబ్బందులొస్తున్నాయా? అని ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఎంపీడీవో కుసుమ మాధురితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో సర్వే వంద శాతం చేశామని ఎంపీడీవో తెలిపారు. ఆన్‌లైన్ డాటా ఎంట్రీ 80.6శాతం పూర్తయిందని చెప్పారు. ఎంట్రీ చేసిన ప్రతీ ఫామ్‌పై పూర్తయినట్లు స్టాంప్ వేస్తున్నామని సౌమ్యామిశ్రాకు వివరించారు. అనంతరం సీపీవో మాట్లాడుతూ ఆన్‌లైన్ డాటా ఎంట్రీ ఆదివారానికల్లా పూర్తిచేయాలని సూచించారు. డాటా ఎంట్రీ పూర్తయిన ఫారాలపై 'కంప్లీటెడ్' స్టాంప్ వేయడం అభినందనీయమని ఎంపీడీవోను అభినందించారు. డాటా ఎంట్రీల్లో తప్పుల్లేకుండా చూడాలని ఆపరేటర్లకు సూచించారు.


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్

శంషాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వరం వంటిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ 22వ వార్డుకు చెందిన ఇందిరకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం ఎమ్మెల్యే ఇందిరకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలకు సీఎం సహాయ నిధి నుంచి కొట్లాది రూపాయలు మంజూరయ్యాయని, బాధితులకు అందజేసి వారి కుటుంబాలను ఆదుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్‌గౌడ్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం చపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 30వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావ్‌పేట, ఖానాపూర్,మెదక్‌పల్లి, వీరన్నపల్లి, గౌరిపల్లి, బల్సుపల్లి తండా, చౌదర్‌పల్లి, కేపీ తండా లను కలిపి గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించాలని, అలా చేసేవరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు.

కంపు కంపు

- డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక కాలనీవాసుల ఇబ్బందులు
- పట్నం మున్సిపాలిటీలో ప్రజలకు తప్పని ఇక్కట్లు
- గతంలో నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- అస్తవ్యస్తంగా కాలనీలు.. పట్టని అధికారులు, పాలకులు


భాగ్యనగర్ కాలనీలో ఇళ్ల మధ్య నుంచి మురుగు కాలువ ఇలా..


సాగర్ రహదారిపై పై ఇంటర్నేషనల్ సంస్థ ఎదుట నిలిచిన మురుగు

ఇబ్రహీంపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పలు కాలనీలు కంపు కొడుతున్నాయి. జనం కూడా ఎవరికి చెప్పుకోలేక మురుగు మధ్యనే సావాసం చేస్తున్నారు. కొత్తగా విస్తరిస్తున్న కాలనీలను అసలు పట్టించుకునేవారే లేరు. 11వ వార్డు బృందావన్ కాలనీలో ఇళ్ల ముందు మురుగు ఏరులై పారుతోంది. దాంతో కంపును భరించలేక జనం ఇళ్ల తలుపులుకూడా తీయలేకపోతున్నారు. కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు విషయం తెలిపినా కనీసం స్పందన లేదు. అలాగే 8వ వార్డు భాగ్యనగర్ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. ఇది పెద్ద కాలనీ అయినప్పటికీ.. 15 ఏళ్లుగా కనీస సౌకర్యాలకు దూరంగా ఉంది. ఇళ్ల మధ్యనే మురుగు పారుతుండగా దోమలు, ఈగల బెడదతో కాలనీవాసులు కాలం వెల్లదీస్తున్నారు. ఈ కాలనీలో ఒక్క డ్రైనేజీ లైన్‌గానీ.. సీసీ రోడ్డుగానీ నిర్మించలేకపోయారు. గత ప్రభుత్వంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి రూ.1.35 కోట్లుతో ప్రతిపాదనలు పంపగా పనులు కూడా మంజూరు చేశారు. ఆ వెంటనే ఎన్నికలు రావడంతో పనులు చేపట్టలేకపోయారు. కాలనీ వాసులు ఎన్నోసార్లు అధికారులను కలిసి విన్నవించినా స్పందన కరువైంది. ఇటీవల టీయూఎఫ్ఐడీసీ నుంచి మున్సిపాలిటీకి రూ.8.09 కోట్లు మంజూరుకాగా, ఎవరి ఇష్టానుసారంగా వారు ఇతర పనులకు ఖర్చు చేశారని ప్రజలు వాపోతున్నారు. కాగా, ప్రాధాన్యతనుబట్టి పనులు తీసుకోవాల్సి ఉండగా.. అవేమీ లేకుండా వారికి ఇష్టమొచ్చిన పనులు చేపట్టారని పలు కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రాధాన్యత పనులను గుర్తించరా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ప్రధాన రహదారిపై పై ఇంటర్నేషనల్ ఎదుట మురుగు పారుతూ కంపు కొడుతోంది. అటుగా వెళ్లేవారు ముక్కున వేలేసుకొని పోతున్నారు. కాగా, మున్సిపల్ పాలకవర్గంలో ఉన్న భేదాభిప్రాయాల మూలంగా జనం ఇబ్బందుల పాలవుతున్నారు.

నిత్యం కంపును భరించలేకపోతున్నాం



మాది 11వ వార్డు. ఇళ్ల ముందే మురుగునీరు పారుతూ కంపు కొడుతోంది. రోజూ వాసనను భరించలేకపోతున్నాం. ఈగలు, దోమల బెడద తీవ్రమైంది. మేము మున్సిపాలిటీలో ఉన్నట్లుగా లేదు. ఎక్కడో అడవిలో ఉన్నట్లుంది. మా కాలనీవైపు కనీసం కన్నెత్తి చూసేవారుకూడా లేరు. ఎవరికి చెప్పినా స్పందన కరువైంది.

- రాణి, బృందావన్ కాలనీ

కౌన్సిల్ తీర్మానం మేరకు పనులు



కౌన్సిల్ తీర్మానం మేరకు పనులు తీసుకుంటున్నాం. భాగ్యనగర్, బృందావన్ కాలనీలాంటి చోట్ల డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. ముున్ముందు అత్యవసరమైన చోట పనులు తీసుకోవాలని నిర్ణయించాం. వచ్చే హెచ్ఎండీఏ నిధులతో ఈ కాలనీల్లో పనులు తీసుకోవాలని నిర్ణయించాం. త్వరలోనే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

- రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్

భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం


పుష్పగుచ్ఛం అందిస్తున్న శేఖర్‌యాదవ్

శంషాబాద్ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం అనంతరం ఢిల్లీ నుంచి శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఇతర నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భట్టికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

హైదర్ అలీకి కలెక్టర్ నారాయణరెడ్డి సన్మానం


హైదర్ అలీకి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసిన హైదర్ అలీ శనివారం పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి హైదర్ అలీ దంపతులను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారికి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా హైదర్ అలీ సేవలను కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సునీల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం : వీర్లపల్లి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 9వ తేదీ వరకు షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. విజయోత్సవాలను నిర్వహణపై షాద్‌నగర్ పట్టణ మున్సిపాలిటీ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. రూ.20.50లక్షలు నిధులు కేటాయించేందుకు కమిషనర్ వెంకన్న చేసిన తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. కాగా, షాద్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి సమీపంలో భారీ జాతీయ జెండా ఏర్పాటుపై కౌన్సిల్‌లో చర్చించారు. రూ.35లక్షలతో సుమారు 30.5 మీటర్ల ఎత్తులో జెండాను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నిధులను మున్సిపాలిటీ సాధారణ నిధుల ద్వారా తీసుకోవాలన్న అంశంపై చర్చ జరిగింది. దీనికి 10వ వార్డు కౌన్సిలర్ శ్రావణి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిధులతో డ్రైనేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టవచ్చని, జెండా కోసం అంత ఖర్చు చేయడం సమంజసం కాదన్నారు. కాగా, షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. శనివారం ఆయన పనులను పరిశీలించారు. షాద్‌నగర్ తాలుకా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి రూ.లక్షా 16వేల చెక్కును విరాళంగా ఎమ్మెల్యేకు అందించారు. అనంతరం చౌడమ్మ గుట్ట హనుమాన్ ఆలయంలో గో పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రైతు పండుగలో పాల్గొనేందుకు నాయకులతో కలిసి పాలమూరుకు వెళ్లారు. పార్టీ నేతలు బాలరాజు గౌడ్, తిరుపతిరెడ్డి, బాబర్ ఖాన్, కృష్ణారెడ్డి తదితరులు మహబూబ్‌నగర్‌కు తరలివెళ్లారు.

విద్యాభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం

షాద్‌నగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. పాలమూరుకు వెళ్లేముందు ఫరూఖ్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్(బాలికలు)లో సొంతనిధులు రూ.1.50లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి విద్యతోనే సామాజాభివృద్ధి జరుగుతుందన్నారు. బాల్యం నుంచే విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.

చాపకింద నీరులా..

(5వ పేజీ తరువాయి)

నీరులా విస్తరిస్తోంది. కేసుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఇది ప్రబలంగా ఉంది. అయితే, చాలామందికి అవగాహన కొరవడి, అప్రమత్తత లేకపోవడం వల్లనే ఈ మహమ్మారి బారినపడుతున్నారు.

జిల్లాలో 2020-21 నుంచి 2024-25 వరకు నమోదైన హెచ్ఐవీ కేసుల సంఖ్య పరిశీలిస్తే.. 1,01,356 మంది అనుమానితులకు రక్త పరీక్షలు చేయగా అందులో 0.14 శాతం (1,465)మందికి హెచ్ఐవీ పాజిటివ్‌గా వచ్చింది. 2020-21 నుంచి ఇప్పటివరకు 72,132 మంది గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా 200 మందికి పాజిటివ్ వచ్చింది. గత ఏడాది దీని సంఖ్య ఎక్కువగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి రంగారెడ్డి జిల్లాకు వచ్చిన వారిలో ఈ మహమ్మారి ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు.

జూలైలో అధికంగా కేసులు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు నెల వరకు హెచ్ఐవీ కేసులను పరిశీలిస్తే.. జూలై మాసంలో కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. జూలైలో 4,960 మందికి పరీక్షలు చేయగా 51 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అక్టోబరులో 50 మందికి ఈ మహమ్మారి సోకింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 24,044 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేయగా 274 మందికి పాజిటివ్‌గా తేలింది. అలాగే 16,622 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా 25 మందికి హెచ్ఐవీ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది.

జాగ్రత్తలు తీసుకోకపోవడంతో...

చాలా మందికి హెచ్ఐవీ ఉన్నా.. బయటకి చెప్పడం లేదు. బంధువులకు తెలుస్తుందనే భయంతో చికిత్సకు దూరంగా ఉంటున్నారు. ఈ విషయం తెలిసినా కూడ ఇతరులతో శృంగారంలో పాల్గొంటున్నారు. చూడటానికి అందంగా ఉన్నారు కదా అని భావించి చాలామంది ఏమీ ఆలోచించకుండా వారితో అనైతిక సంబంధాలు కొనసాగిస్తున్నారు. రక్షణ కోసం కండోమ్ కూడా వాడటం లేదు. ప్రస్తుతం హెచ్ఐవీ కేసుల సంఖ్య పెరగడానికి ఇది కూడా ఓ కారణమని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

10.69 లక్షల కండోమ్స్ వినియోగం..

2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 10,69,060 కండోమ్స్‌ను వినియోగించినట్లు అధికారికంగా లెక్కలు చెబుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం అన్నిచోట్ల కండోమ్స్ అందుబాటులో ఉంచారు. కొన్నిచోట్ల ప్రత్యేక బాక్స్‌లను పెట్టి వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు.

అనుమానం ఉంటే టెస్ట్ చేయించుకోవాలి



హెచ్ఐవీ సోకిన తర్వాత వ్యాధి లక్షణాలు బయట పడేందుకు ఒక్కొక్కరికి ఒక్కోలా సమయం పడుతుంది. రోగ నిరోధక వ్యవస్థ ఎంత బలంగా ఉంటే వ్యాధి లక్షణాలు అంత ఆలస్యంగా బయటపడుతాయి. అందుకే వ్యాధి సోకిన వెంటనే ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఒకవేళ వ్యాధి సోకిందనే అనుమానం కలిగిన వెంటనే మూడు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి. కాగా, ఒకసారి నెగటివ్ వస్తే హెచ్ఐవీ లేనట్టే.

- వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కలిసి ఉన్నా, తిన్నా సోకదు



హెచ్ఐవీ చాలా సున్నితమైన వైరస్. ఇది మన రక్తంలో కాకుండా బయట ఏమాత్రం జీవించదు. బాహ్య వాతావరణంలోకి వచ్చిన సెకన్ల వ్యవధిలోనే ఈ వైరస్ చనిపోతుంది. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులతో కలిసి ఆహారం తిన్నా, వారిని తాకినా వైరస్ వ్యాప్తి చెందదు. చెమట, విసర్జితాల ద్వారా కూడా ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. వ్యాధిగ్రస్తులు ఉపయోగించిన వస్తువులను నిరభ్యంతరంగా వినియోగించవచ్చు. వ్యాధి ఉన్నవారికి ఉపయోగించే సూదులు ఇతరులకు ఉపయోగించవద్దు.

- డాక్టర్ పాపారావు, జిల్లా అదనపు వైద్యాధికారి

జాగ్రత్తలు తప్పనిసరి..



అసురక్షిత సంపర్కం, కండోమ్ లేకుండా శృంగారం చేయడం ద్వారా హెచ్ఐవీ వస్తుంది. జాగ్రలు తప్పనిసరిగా తీసుకోవాలి. హెచ్ఐవీ రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీసే ఒక వైరస్. ఇది ప్రారంభంలోనే గుర్తించపోతే శరీరంలోని సీడీ-4 కణాలను చంపేస్తుంది. సీడీ-4 అనేది టీసెల్ అని పిలువబడే ఒక రోగ నిరోధక కణం. హెచ్ఐవీ వచ్చిన వారిలో జ్వరం, చలి, శోషరస గ్రంథుల వాపు, సాధారణ నొప్పులు, చర్మపు దద్దుర్లు, గొంతు నొప్పి, తలనొప్పి, శరీరనొప్పి, వికారం, కడుపు నొప్పి కనిపిస్తాయి. ఇలాంటి సందర్భంలో వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి.

- నరేందర్, సీపీఎం

అక్రమ కట్టడాల తొలగింపు


అజీజ్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మొయినాబాద్ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అజీజ్‌నగర్ పరిధిలోని ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణాలను శనివారం సాయంత్రం మండల రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి తొలగించారు. గ్రామంలో ని సర్వేనంబర్ 177లో గల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన కంటెయినర్‌ను తొలగించారు. అలాగే సర్వేనంబర్ 49లోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే కఠిన చర్యలు తప్పవని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్


కడ్తాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తమ విధానాలతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సిద్దు, సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్యలు అన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కడ్తాల మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే మంత్రులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హెచ్ఎం జంగయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, ప్రశాంత్, రాఘవేందర్, చరణ్, అక్షయ్, వేణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి


నిరసనలో పాల్గొన్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఆమనగల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించి ఆదుకోవాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వంకేశ్వరం రమేశ్ కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు పూలే, అంబేద్కర్, సాహుమహారాజ్, కాన్షీరామ్ పేర్లు పెట్టి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అర్హుందరికి విద్య, వైద్యం, ఉపాధి, సాగు భూమి, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ శనివారం డీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు బలరామ్, జగన్, హరి, ప్రవీణ్, జంతుక యాదగిరి మహేశ్, గోపాల్ నాయక్, పరమేశ్వర్, శ్రీశైలం, శివ, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగకు భారీగా తరలిన రైతులు


కడ్తాల్ : సభకు బయలు దేరుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రైతు పండుగ, సీఎం బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా రైతులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈమేరకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులను సమీకరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆమనగల్లు పట్టణానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే వాహనాల కాన్వాయ్‌ని ప్రారంభించారు. కాగా, కల్వకుర్తి నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, ఆధునీకరణకు రూ.91 కోట్ల మంజూరు కు రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. వారంరోజుల్లో ఆయా పనులకు నిధులు విడుదలవుతాయని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు వచ్చే మూడేళ్లలో బీటీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్ చొరవతో కల్వకుర్తి నియోజవర్గంలో రోడ్ల విస్తరణకు ఇప్పటికే రూ. 204 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. సమావేశంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి


అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న దొడ్డి శ్రీనివాస్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఐసీడీఎస్‌కు వచ్చే అంగన్‌వాడీ కార్యకర్తల మౌలిక సౌకర్యాలను కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణలోని చెట్ల కింద సమావేశం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను జన కళ్యాణ్ దివస్ పర్యటనలో భాగంగా శనివారం బీఎస్పీ నాయకులు కలిసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. షాద్‌నగర్ ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో దాదాపు 300 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారని, వారందరు ప్రతీనెల సమావేశానికి వచ్చి, సౌకర్యాలు లేక చెట్ల కిందనే సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యాలయంలో ఒకటే బాత్రూం ఉండడంతో ఇబ్బందిగా ఉందని తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమావేశ హాలును, తగినన్ని బాత్‌రూమ్‌లను నిర్మించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్ వెంట బీఎస్పీ నాయకులు సొంటె శ్రీనివాస్, జి. మోజెస్, అంజనేయులు, రాజు, నర్సింహులు తదితరులు ఉన్నారు.

'రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్'


మాట్లాడుతున్న దశరథ్ నాయక్

కడ్తాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, రైతులను నమ్మించి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దశరథ్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతుపండగను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దశరథ్ నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని తెలిపారు. రైతులకు ఏం మేలు చేశారని సంబురాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. సాయిలు, జంగయ్య, కడారి రామకృష్ణ, మంగళపల్లి నర్సింహ్మా, అశోక్, మహేశ్, రామచంద్రయ్య, తదితరులున్నారు.

నిబద్ధతతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు : సీఐ


ఎండీ జాకీర్ అలీని సన్మానిస్తున్న సీఐ శ్రీలత తదితరులు

చేవెళ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో పనిచేస్తే సమాజంలో ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందని చేవెళ్ల డివిజన్ అబ్కారీ సీఐ శ్రీలత అన్నారు. మండల కేంద్రంలోని అబ్కారీ శాఖ పోలీస్‌స్టేషన్‌లో 37 సంవత్సరాలు పీఅండ్‌ఈసీగా విధులుగా నిర్వహించిన ఎండీ జాకీర్ అలీ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అందరినీ కలుపుకొని విధులు నిర్వహించే జాకీర్ అలీ శేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, అనంతరెడ్డి, ఖాజామొయినుద్దీన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేదీప్యమానం.. కోటి దీపోత్సవం


షాద్‌నగర్ రూరల్ : దీపాలు వెలిగిస్తున్న మహిళలు

షాద్‌నగర్ రూరల్/కడ్తాల్/ఆమనగల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో మూడు రోజుల పాటు జరిగిన కోటి దీపోత్సవం శనివారం ముగిసింది. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీ సేవ ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు మహిళలు పాల్గొన్నారు. కార్తీక మాసం ముగింపు వేడుకలను పురస్కరించుకొని కడ్తాలలోని శ్రీ కురుమూర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రవీణ్‌కుమార్, ఈవో మోహన్ రెడ్డిలు వెంకటేశ్‌ను శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే ఆమనగల్లు మున్సిపాలిటీలోగల మాడ్గుల రోడ్డులో ఉన్న అంతిరింతిరి కొండపై ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు, వ్రతాలు ఘనంగా చేశారు. శనివారం ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి తీవ్ర గాయాలు

యాచారం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. మండల పరిధిలోని నందివనపర్తికి చెందిన మోతీలాల్(35) శనివారం రాత్రి బైక్‌పై మాల్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. తక్కళ్లపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మారుతి కారు బైక్‌ను ఢీకొట్టింది. దాంతో మోతీలాల్‌కు తీవ్రగాయాలు కాగా, పోలీసులు ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.నర్సింహారావు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **కేశంపేట** : రైతుల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లంకాల సురేష్‌రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీధర్ రెడ్డి నివాసంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు సదస్సులో సీఎం రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రూప్లా నాయక్, కరుణాకర్ రెడ్డి, పర్వతాలు, రాజేందర్‌రెడ్డి, మనోహర్ గౌడ్, సురేష్ మాదిగ, పాండు, విజయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ప్రజల ఆరోగ్యం దెబ్బతీసే కోనోకార్పస్ మొక్కలను తొలిగించాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకర్ శివాజీ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డికి గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో హరితహారంలో భాగంగా ప్రతీ గ్రామంలో కోనోకార్పస్ మొక్కలు నాటిందని గుర్తుచేశారు. శ్రీనివాస్, శివగౌడ్, మహేష్, వినోద్, రాఘవేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

● **మాడ్గుల** : మండలంలోని నాగిళ్ల గ్రామంలో జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజన వంటపాత్రలకు రంధ్రాలు పడటంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని టీచర్లు గ్రామ ఉపసర్పంచ్ శ్రీశైలం దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు ఆయన కొత్త వంట పాత్రలను సమకూర్చారు. దాంతో ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు.

● **చేవెళ్ల** : విద్యార్థులకు పాఠశాల దశలోనే సామాజిక సేవపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ న్యాయవాది కృష్ణాగౌడ్, అబ్కారీ ఎస్సై వెంకటేశ్వర్ రెడ్డిలు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో వారం రోజుల నుంచి సామాజిక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. డ్రాయింగ్ కాంపిటీషన్, న్యూస్‌పేపర్ మేకింగ్, వివిధ రాష్ట్రాల ప్రజల వస్త్రధారణ, నృత్యాలు, వివిధ రాష్ట్రాల ఆహార, ఆచార వ్యవహారాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు శనివారం సామాజిక అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణాగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డిలు పాల్గొని వారి సందేశాలను విద్యార్థులకు అందించారు. డాక్టర్ తబస్సుమ్, ఏజీఎం వెంకట్, హెచ్ఎం రాకేష్‌కుమార్, డీన్ అంజయ్య, రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి** : మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిరుమణి దశరథం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మృతుడి కుటుంబాన్ని తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మల్‌శ్రీశైలం గౌడ్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి వెంకటేశ్ రూ.3 వేలు, నిర్మల్‌శ్రీశైలం గౌడ్ రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మోహన్‌రెడ్డి, అంజనేయులు గౌడ్, జనార్దన్ గౌడ్, యాదయ్య గౌడ్, తిరుపతి, మల్లేశ్, వెంకటేశ్‌గౌడ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, సత్తిరెడ్డి, కృష్ణయ్య, శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.